# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 04-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పలు కీలక బిల్లుల ఆమోదం అనంతరం పార్లమెంట్ ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి.
- ❖ ప్రపంచ వ్యాప్తంగా ఇంధన సంక్షోభం నెలకొన్నప్పటికీ దేశంలో ఎలాంటి ఇంధన కొరత తలెత్తలేదని కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి తెలిపారు.
- ❖ "ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన" కింద దేశవ్యాప్తంగా 50 లక్షలకు పైగా కుటుంబాలు లబ్ధి పొందాయని ప్రభుత్వం వెల్లడించింది.
- ❖ కామన్వెల్త్ గేమ్స్-2026లో పతకాలు సాధించిన భారత క్రీడాకారులను కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయ ఈరోజు సత్కరించారు.

====================

అప్రోప్రియేషన్ (నంబర్–3) బిల్లు-2026ను లోక్‌సభ ఈరోజు ఆమోదించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో కొన్ని సేవలపై మంజూరైన నిధులను మించి చేసిన వ్యయాన్ని భర్తీ చేసేందుకు భారత సమీకృత నిధి నుంచి నిధుల వినియోగానికి ఈ బిల్లు అనుమతి కల్పిస్తుంది. ఇందుకోసం 54 వేల కోట్ల రూపాయలకు పైగా అదనపు నిధులను ప్రభుత్వం కోరింది. అంతకుముందు పన్నులు, ఇతర చట్టాల (సవరణ) బిల్లు–2026ను ఆర్థిక మంత్రి లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ద్వారా పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టం–2007, ఆదాయపు పన్ను చట్టం–2025, అలాగే ఆర్థిక చట్టం–2026లో సవరణలు చేయనున్నారు. అదే విధంగా ఆదాయపు పన్ను (సవరణ) ఆర్డినెన్స్–2026ను తక్షణం జారీ చేయాల్సిన అవసరాన్ని వివరిస్తూ.. ఒక వివరణాత్మక ప్రకటనను కూడా మంత్రి సభలో ఉంచారు. భారత్‌ను ప్రపంచ పెట్టుబడులు, తయారీ రంగం, వ్యాపారాలకు మరింత ఆకర్షణీయమైన, స్థిరమైన గమ్యస్థానంగా తీర్చిదిద్దడం ఈ బిల్లులోని ప్రతిపాదనల ప్రధాన ఉద్దేశం. భారత డేటా

సెంటర్లను వినియోగించే విదేశీ క్లౌడ్ కంపెనీలకు గతంలో పన్ను మినహాయింపులు ప్రకటించినప్పటికీ.. అనేక స్థాయిల్లో ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి కావడంతో అవి అమల్లో ఇబ్బందులు ఎదుర్కొన్నాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = =

జనన, మరణాల నమోదు (సవరణ) బిల్లు–2026కు పార్లమెంట్ ఆమోదం లభించింది. ఈ బిల్లును రాజ్యసభ ఈరోజు ఆమోదించడంతో పార్లమెంట్ ఆమోదం పూర్తయింది. లోక్‌సభ ఇప్పటికే ఈ బిల్లును ఆమోదించింది. జననాలు, మరణాల నమోదు చట్టం–1969లో సవరణలు చేసేందుకు ఉద్దేశించిన ఈ బిల్లును కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ రాజ్యసభలో ఈరోజు ప్రవేశపెట్టారు. బిల్లుపై జరిగిన చర్చకు నిత్యానంద్ రాయ్ సమాధానమిస్తూ... ఆలస్యంగా జరిగే నమోదును దుర్వినియోగం చేసే అవకాశాలను నివారించేందుకే ఈ సవరణలు తీసుకువచ్చినట్లు తెలిపారు. రెండు సంవత్సరాలకు మించి ఆలస్యంగా జనన, మరణాల నమోదుకు దరఖాస్తు చేసిన సందర్భంలో, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు మాత్రమే నమోదు చేపట్టనున్నట్లు వెల్లడించారు. రెండేళ్లకు మించిన ఆలస్య నమోదుకు సంబంధించిన నిబంధన మినహా, ప్రస్తుతం అమలులో ఉన్న నమోదు విధానంలో ఎలాంటి ఇతర మార్పులు లేవని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రతిపక్షాల నిరసనలతో పార్లమెంట్ ఉభయ సభల కార్యకలాపాలకు పలు మార్లు అంతరాయం ఏర్పడింది. నీట్ ప్రశ్నా పత్రం లీకేజ్ వ్యవహారంపై విద్యార్థుల నిరసన సందర్భంగా జరిగినట్లు ఆరోపిస్తున్న పోలీసుల చర్యతో పాటు పలు అంశాలపై ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు దిగడంతో రాజ్యసభకు అంతరాయం ఏర్పడింది. రాజ్యసభ తొలి వాయిదా అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి సమావేశమైనప్పుడు, సభాపతి సి.పి. రాధాకృష్ణన్ ప్రశ్నోత్తరాల సమయాన్ని ప్రారంభించారు. ప్రతిపక్ష సభ్యుల ఆందోళనల మధ్య పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధిత మంత్రులు సమాధానాలు ఇచ్చారు. అయితే నినాదాలు, నిరసనలు కొనసాగడంతో సభాపతి రాజ్యసభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. అంతకుముందు ఉదయం జీరో అవర్ ప్రారంభమైన సందర్భంగా ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే అయోధ్య రామమందిరానికి వచ్చిన విరాళాల దొంగతనం ఆరోపణల అంశాన్ని ప్రస్తావించారు. దీనికి పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరెన్ రిజిజు స్పందిస్తూ, అయోధ్యలో రామమందిర నిర్మాణాన్ని వ్యతిరేకించిన కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు ఇప్పుడు విరాళాల దొంగతనం పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ఇక లోక్‌సభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమైన తర్వాత స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాల సమయాన్ని చేపట్టేందుకు ప్రయత్నించినప్పటికీ.. నీట్ ప్రశ్నపత్రం లీక్ అంశంపై విద్యార్థుల నిరసన సందర్భంగా జరిగినట్లు ఆరోపిస్తున్న పోలీసుల చర్యపై ప్రతిపక్ష సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రెండో వాయిదా అనంతరం మధ్యాహ్నం 2 గంటల వరకు తిరిగి సమావేశమైనపుడు అప్రోప్రియేషన్ బిల్లు ఆమోదం పొందిన అనంతరం, సభ రేపు ఉదయం 11 గంటలకు వాయిదా పడింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ వ్యాప్తంగా ఇంధన సంక్షోభం నెలకొన్నప్పటికీ దేశంలో ఎలాంటి ఇంధన కొరత తలెత్తలేదని పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి తెలిపారు. దేశంలో తగిన స్థాయిలో ఇంధన నిల్వలను కొనసాగించడంతో పాటు, గృహ వినియోగానికి అవసరమైన ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ సరఫరాను నూరు శాతం నిరంతరాయంగా అందించినట్లు మంత్రి వెల్లడించారు.పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సమావేశానికి న్యూఢిల్లీలో తాను అధ్యక్షత వహించినట్లు హర్దీప్ సింగ్ పూరి ఈరోజు సామాజిక మాధ్యమ పోస్ట్ లో తెలిపారు. దేశ ఇంధన అవసరాలను భద్రపరిచేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలను సమావేశంలో సభ్యులకు వివరించినట్లు చెప్పారు. ఇంధన దిగుమతుల వనరులను 27 దేశాల నుంచి 41 దేశాలకు పెంచడం ద్వారా సరఫరా మార్గాలను విస్తరించామని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = =

పాకిస్థాన్ ఆక్రమిత జమ్మూ-కాశ్మీర్‌లో నిర్వహించినట్లు చెబుతున్న స్థానిక ఎన్నికలను మోసపూరిత ఎన్నికలని భారత్ అభివర్ణించింది. ఇటువంటి నామమాత్రపు ఎన్నికల ద్వారా అక్కడి వాస్తవ పరిస్థితులను దాచిపెట్టలేరని విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఆ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ న్యూఢిల్లీలో ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... పాకిస్థాన్ ఆక్రమిత జమ్మూ-కాశ్మీర్‌లో ప్రస్తుతం జరుగుతున్న అసలు పరిణామాలు ప్రజల నిరసనలు, పాకిస్థాన్ బలగాల విచక్షణారహిత హత్యాకాండలే అని అన్నారు. ఈ ఏడాది జూన్ నుంచి కొనసాగుతున్న అణచివేత చర్యల్లో ఇప్పటివరకు కనీసం 90 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. ప్రజల అసంతృప్తికి పాకిస్థాన్ ప్రభుత్వం తూటాలు, బెదిరింపులు, నిర్బంధాలతో సమాధానం చెబుతోందని, ఇప్పుడు బూటకపు ఎన్నికల ద్వారా చట్టబద్ధత ఉన్నట్లు చూపించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

`ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన` కింద దేశవ్యాప్తంగా 50 లక్షలకు పైగా కుటుంబాలు లబ్ధి పొందినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ పథకం ప్రజలను సాధికారత దిశగా నడిపిస్తూనే.. పరిశుభ్రమైన ఇంధన భద్రత కలిగిన భవిష్యత్ వైపు భారతదేశాన్ని వేగంగా తీసుకెళ్తోందని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. ఈ పథకం కింద 19 లక్షలకు పైగా కుటుంబాలు ప్రస్తుతం సున్నా రూపాయల విద్యుత్ బిల్లు పొందుతున్నాయని మంత్రి సామాజిక మాధ్యమం వేదికగా తెలిపారు. అలాగే దేశ వ్యాప్తంగా 25 వేలకు పైగా కేంద్ర ప్రభుత్వ భవనాలు, 81 వేలకు పైగా రాష్ట్ర ప్రభుత్వ భవనాలు రూఫ్‌టాప్ సౌర విద్యుత్ వ్యవస్థల ద్వారా విద్యుత్‌ను వినియోగిస్తున్నాయని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

కామన్వెల్త్ గేమ్స్–2026లో చారిత్రక ప్రదర్శనతో పతకాలు సాధించి స్వదేశానికి చేరుకున్న భారత క్రీడాకారులను కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ఈరోజు సత్కరించారు. న్యూఢిల్లీలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో స్వర్ణ పతక విజేతలకు 30 లక్షల రూపాయలు, రజత పతక విజేతలకు 20 లక్షల రూపాయలు, కాంస్య పతక విజేతలకు 10 లక్షల రూపాయల చొప్పున నగదు ప్రోత్సాహకాలను సైతం అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో ముచ్చటించిన కేంద్రమంత్రి... భారత క్రీడారంగానికి భావితరాలను తీర్చిదిద్దే మార్గదర్శకులుగా ఎదగాలని విజేతలకు సూచించారు. యువ క్రీడాకారులకు శిక్షణ, ప్రోత్సాహం అందిస్తూ భారత క్రీడల అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. 36 వేల కోట్ల రూపాయల వ్యయంతో పునరుద్ధరించిన 'ఖేలో ఇండియా' పథకాన్ని కూడా మంత్రి ప్రస్తావించారు. రాబోయే సంవత్సరాల్లో భారత క్రీడారంగ అభివృద్ధికి అవసరమైన పెట్టుబడులను నిరంతరంగా అందించేందుకు ఈ పథకం దోహదపడుతుందని కేంద్రమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =